క్లుప్తంగా

ఉద్యోగులు సమయ పాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొలిమిగుండ్ల: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. సోమవారం కొలిమిగుండ్లలోని ఒకటి, రెండు గ్రామ సచివాలయాలతో పాటు రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులతో పాటు ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పరిశీలించారు. విధి నిర్వహణలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందకుండా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



కార్మికులను ఎలా రక్షించాలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

బనగానపల్లె రూరల్: ముందస్తు జాగ్రత్తలు, అప్రమత్తతతో పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు నివారించవచ్చని స్థానిక అగ్నిమాపకశాఖ అధికారి నరసింహులు అన్నారు. సోమవారం అగ్ని మాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా యనకండ్ల గ్రామంలోని జయజ్యోతి సిమెంట్ పరిశ్రమలో కార్మికులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో కార్మికులను ఎలా రక్షించాలి, మంటలను ఎలా ఆర్పివేయాలనే విషయాలు ప్రదర్శనతో వివరించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట



కోవెలకుంట్ల: పట్టణ శివారులోని వెంకటరమణ కాలనీలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆంజనేయస్వామి, గరుత్మండు, సుబ్రమణేశ్వరస్వామి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ముందుగా పంచామృతాభిషేకం, అర్చనలు, మహా మంగళహారతి, సుదర్శన, రుద్రహోమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠించారు. అలాగే ఆలయంలో వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా మండల పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


మైసూరమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న మైసూరమ్మ

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల గ్రామంలో వెలసిన మహిషాసురమర్ధిని(మైసూరమ్మ) ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అభిషేకం, అర్చన, పంచామృతాభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు.

శివపార్వతులకు పల్లకీ సేవ



శివపార్వతులకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పల్లకీ సేవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి సేకా కార్యక్రమాన్ని నిర్వహించారు.

బంగారు ఆభరణాలు బ్యాంకుల్లో పెట్టండి

బేతంచెర్ల: ఇళ్లకు తాళం వేసి వేరే ప్రాంతాలకు వెళ్లే సమయంలో బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు ఇళ్లలో పెట్టి వెళ్లొద్దని సీఐ ప్రియతం రెడ్డి సూచించారు. ఎస్ఐ శివ శంకర్ నాయక్‌తో కలిసి సోమవారం కర పత్రాలు పంచుతూ, ఆటోలో మైక్ ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేశారు. విలువైన బంగారు, నగదును బ్యాంకుల లాకర్లలో పెట్టుకోవాలన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇస్తే నిఘా ఉంచుతామన్నారు.

‘అమ్మ’ల ఆనందం

- ప్రభుత్వాసుపత్రిలో పెరుగుతున్న ప్రసవాలు
- క్యూ కడుతున్న గర్భిణులు
- సుఖ ప్రసవాలు చేస్తూ మన్ననలు అందుకుంటున్న డాక్టర్లు



సీ మాంక్ సెంటర్ వద్ద పరీక్షల కోసం వేచివున్న గర్భిణులు

డోన్: నెలలు నిండి ప్రభుత్వాస్పత్రికి వచ్చిన గర్భిణులు సుఖ ప్రసవంతో అమ్మలై తమ బిడ్డలతో ఆనందంగా ఇళ్లకు తిరిగి వెళ్తున్నారు. క్లిష్టమైన కాన్పులను కూడా డాక్టర్లు సుఖ ప్రసవాలు చేస్తుండటంతో ఆస్పత్రికి వచ్చే గర్భిణుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్పు చేశారు. నూతనంగా గైనకాలజిస్టు డాక్టర్ రమ్యశిల్పతో పాటు హెచ్‌ఓడీ డాక్టర్ అనురాధలను నియమించడంతో కాన్పుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం ఆసుపత్రిలో వివిధ విభాగాలకు 15 మంది వైద్యులు ఉన్నారు. గైనిక్ విభాగంలో ఇద్దరు వైద్యులు మాత్రమే ఉన్నా ఆస్పత్రికి వచ్చిన గర్భిణుల పట్ల మాత్రం నిర్లక్ష్యం చేయకుండా శాయశక్తులా కృషి చేసి సుఖ కాన్పు చేస్తూ శెభాస్ అనిపించుకుంటున్నారు. అయితే హెచ్‌ఓడీ డాక్టర్ అనురాధను వారానికి రెండురోజుల పాటు ఆత్మకూరు ఆసుపత్రికి డిప్యుటేషన్‌పై పంపకపోతే మరిన్ని కాన్పులు నమోదయ్యే అవకాశం ఉంది. ఇక ఖాళీగా ఉన్న మూడో గైనకాలజిస్ట్ పోస్టును కూడా భర్తీ చేస్తే ఇక్కడి పేద గర్భిణులకు మరింత సేవలు అందే వీలుంటుందనిపలువురు అభిప్రాయపడుతున్నారు.

రికార్డు స్థాయిలో కాన్పులు

మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు గర్భిణుల ఓపీ సంఖ్య 2,400. ఇందులో అడ్మిషన్లు 850 కాగా, 182 కాన్పులు జరిగినట్లు వైద్యులు తెలిపారు. ఇందులో సాధారణ కాన్పులు 133 కాగా, సిజేరియన్ 49 ఉన్నట్లు వైద్యులు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకే నెలలో ఇంత పెద్ద సంఖ్యలో కాన్పులు జరగడం ఇదే మొదటిసారి అని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గత డిసెంబర్ నెలలో 178 కాన్పులు జరగగా, అటుతర్వాత ఈ నెలలో ప్రసవాల సంఖ్య 182కి పెరిగింది.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న గైనకాలజిస్ట్

కేంద్ర బిందువు..

డోన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్యాపిలి, బేతంచెర్ల, డోన్, కృష్ణగిరి, వెల్దుర్తి, తుగ్గలి, పత్తికొండ, దేవనకొండ, మద్దికెర మండలాల ప్రజలకు ఎంతో అనువైన ఆసుపత్రిగా పేరుగాంచింది. ఈ ఆసుపత్రి స్థాయి 30 పడకల నుంచి 100 పడకలకు పెంచడంతో గుత్తి రోడ్డులో రూ.30 కోట్లతో నూతన భవన నిర్మాణాలను చేపట్టారు. మరో మూడు, నాలుగు నెలల్లో ఆసుపత్రి నూతన భవనాలలోకి మార్చాల్సి ఉంటుంది.

బయటకు పంపేవారిపై కఠినచర్యలు



ఎలాంటి భయం లేకుండా ప్రసవం కోసం ఆసుపత్రికి రావచ్చు. ఇక్కడికి వచ్చిన గర్భిణులకు బయటి నర్సింగ్ హోంలకు పంపే సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం గైనకాలజిస్టు పోస్టు ఒకటి ఖాళీగా ఉంది. ఆసుపత్రిలో గైనకాలజిస్టుల సంఖ్య మూడుకు పెరిగితే కాన్పుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది.

– డాక్టర్ ఎస్ఎండీ హనీఫ్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, డోన్

సిబ్బంది వైఖరి మారాలి

ప్రభుత్వాసుపత్రికి ముఖ్యంగా కాన్పుల కోసం వచ్చే గర్భిణులను కొంతమంది సిబ్బంది మభ్యపెట్టి కాసుల కోసం కక్కుర్తి పడుతూ ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లేందుకు ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో గైనకాలజిస్టుగా పనిచేసిన ఒక వైద్యుడు కొందరు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు కేసుకు రూ.2వేల చొప్పున ఆశ చూపి తాను నిర్వహిస్తున్న ప్రైవేట్ నర్సింగ్ హోంకు రోగులు వచ్చేవిధంగా చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పద్ధతులను మానుకుని విధి నిర్వహణను నిబద్ధతతో చేయగలిగితే ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చేసే కాన్పుల సంఖ్య మరింత పెరిగి పేద కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంటుంది.

రాయలసీమ కర్తవ్యదీక్షను జయప్రదం చేయాలి

కోవెలకుంట్ల: రాయలసీమ హక్కుల సాధన కోసం నిర్వహించ తలపెట్టిన కర్తవ్య దీక్షను జయప్రదం చేయాలని రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కోఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక జీవీ కొండారెడ్డి స్మారక గ్రంథాలయంలో దీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం, సంగమేశ్వరం వద్ద కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జికి బదులు రోడ్‌కం బ్యారేజీ ఏర్పాటు చేయాలన్నారు. కర్ణాటక ప్రభుత్వం అప్పర్‌భద్ర ప్రాజెక్టును నిర్మించడం వల్ల తుంగభద్ర నది నుంచి రావాల్సిన నికర జలాలు హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ, కేసీ కెనాల్, భైరవాణి ప్రాజెక్టులకు రావన్నారు. వెంటనే ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24న కర్నూలులోని ఎస్టీబీసీ మైదానంలో జరిగే కర్తవ్య దీక్షకు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు కరీంబాషా, సీమ కృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, సుధాకర్, రవీంద్ర పాల్గొన్నారు.

కర పత్రాలు విడుదల

బనగానపల్లె: రాయలసీమ హక్కుల కోసం ఈ నెల 24న కర్నూలు ఎస్టీ, బీసీ కళాశాల మైదానంలో జరిగే నిరసన దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు ఆర్‌వీఎస్ సీమ కృష్ణ కోరారు. దీక్షకు సంబంధించిన కరపత్రాలను సీఐ సుబ్బరాయుడు చేతుల మీదుగా సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీమ కృష్ణ మాట్లాడారు.

ఆలయ రస్తాను కాపాడండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

డోన్ టౌన్: పెద్దమ్మ ఆలయ రస్తాను కబ్జాదారుల నుంచి కాపాడాలని మండలంలోని పెద్ద మల్కాపురం గ్రామస్తులు అధికారులను కోరారు. గ్రామస్తులు చెన్నకేశవులు, ఈశ్వరరెడ్డి, ఖాజా హుస్సేన్, మౌలాలీ, అవుల పెద్ద నాగన్న, బాలు, కేశవ కుమార్, నూర్‌బాషాతో పాటు మరో 30 మంది సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గాండ్ల ఈశ్వరయ్య కుమారుడు రామదాసు ఆలయ రస్తాను కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్.. గ్రామ రెవెన్యూ అధికారి చేత విచారణ చేయించి బాధితుడిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పెద్ద మల్కాపురం గ్రామంలో కబ్జాకు గురైన గుడి రస్తాను తిరిగి స్వాధీనం చేసుకుని గ్రామస్తుల సంప్రదాయలకు భంగం వాటిల్లకుండా చూడాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్‌రెడ్డి తహసీల్దార్‌కు విన్నవించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కోనా మురళీధర్‌రెడ్డి



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న నాయకులు

డోన్: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు కోనా మురళీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక 3, 4 సచివాలయాల పరిధిలో పార్టీ బీసీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టు ప్రసాద్‌తో కలిసి జగనన్నే మా భవిష్యత్తు – నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న పాలనపై అభిప్రాయాలు సేకరించారు. ఇంటి యజమానుల అనుమతితో ఇళ్ల గోడలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం ఉన్న స్టిక్కర్‌ను అతికించారు. ఈ సందర్భంగా కోనా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కోఆప్షన్ సభ్యులు పాతపేట రఫీ, పార్టీ నాయకులు వడ్డె రంగస్వామి, డంకేష్, సుంకన్న, మేడ రఘు, దుబాయ్ శ్రీను, షాషా, కురుకుంద గోవిందురాజులు పాల్గొన్నారు.

19 నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ



ఉచిత శిక్షణ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్.

బేతంచెర్ల: పాలీసెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈనెల 19 నుంచి స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలోనే ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. శిక్షణకు సంబంధించిన పోస్టర్లను సోమవారం వారు విడుదల చేశారు. మంత్రి బుగ్గన చొరవతో పాలిటెక్నిక్ కళాశాల, ఎంట్రన్స్ టెస్ట్ పరీక్ష కేంద్రం మంజూరయ్యాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే 10న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈఏడాది నుంచే బుగ్గన రామనాథ్‌రెడ్డి భవనంలో తరగతులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు మంజూరయ్యాయని కళాశాల ఓఎస్డీ రాజేష్ తెలిపారు. కళాశాల మంజూరుకు కృషి చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, గూని నాగరాజు, తిరుమలేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మంత్రి పీఏ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డిలు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన జాతీయ అప్రెంటిషిప్ అవేర్‌నెస్ వర్క్ షాపులో వారు మాట్లాడారు. టెక్నాలజీతోపాటు పోటీ పడాలంటే స్కిల్స్ డెవలప్ చేసుకోవాలన్నారు. రీజినల్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెనూర్‌షిప్ ప్రతినిధి చంద్రమౌళి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ ప్రతి పరిశ్రమలో అప్రెంటిషిప్ అవకాశాలు పుష్కలంగా ఉంటాయని, ఐటీఐ చదివిన ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి రాంకో సిమెంట్ ప్రతినిధి వరప్రసాద్, సౌత్ సెంట్రల్ రైల్వే ప్రతినిధి నవీన్‌కుమార్, తాడిపత్రి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్, అల్ట్రాటెక్ సిమెంట్ ప్రతినిధి రామేశ్వరరెడ్డి, తిరుపతి ఆర్‌డీడీ ఆనందరావు తదితరులు హాజరయ్యారు.

వేధింపులు మానుకోవాలి

డోన్ టౌన్: ఆశ వర్కర్లపై ఏఎన్ఎంలు వేధింపులు మానుకోవాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్ కోరారు. ఆశ వర్కర్లతో కలిసి సోమవారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూర్ అర్బన్ సెంటర్‌లో ఏఎన్ఎం వేధింపులు భరించలేక ఆశా వర్కర్ నజీర్నిషా ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం బాధాకరమన్నారు. మంగళవారం నందికొట్కూర్‌లో నిర్వహించనున్న ధర్నాకు ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్వరమ్మ, ఉమ, ఉమాదేవి, హుస్సేన్‌బీ, కుల్లాయమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా విక్రేతకు రిమాండ్

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని దొరపల్లె రైల్వే గేట్ల సమీపంలో గ్రామానికి చెందిన ఎరుకల సుంకన్న నాటు సారా విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ శేషయ్య తెలిపారు.

‘స్పందన’ను సద్వినియోగం చేసుకోండి

బేతంచెర్ల: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంగన్న అన్నారు. స్థానిక కార్యాలయంలో ఎంపీడీఓ, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్, ఏఓ కిరణ్ కుమార్, ఎంఈఓ సోమశేఖర్, వెలుగు ఏపీఎం లింగమయ్య ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.

హీమోఫిలియాపై అవగాహన

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో హీమోఫిలియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రపంచ హీమోఫిలియా దినోత్సవం సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మహమ్మద్‌గౌస్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ రవికుమార్, నరేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ కోటేశ్వర రావు, కౌసల్యదేవి పాల్గొన్నారు.

వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

కోవెలకుంట్ల: కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి పంచాయతీ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జున రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, పార్టీ న్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో డాక్టర్ పోచా శివప్రభాకర్‌రెడ్డి మృతి



డోన్ టౌన్: వైఎస్సార్‌సీపీ నాయకుడు, పట్టణానికి చెందిన డాక్టర్ పోచా శివప్రభాకర్ రెడ్డి(82) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ప్రభాకర్‌రెడ్డికి గతంలోనే భార్య ఇందిరమ్మ, కుమారుడు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిలు మృతిచెందడంతో కోడలు ఉదయలక్ష్మి, మనవడు శ్రీఫణీంద్రరెడ్డి, మనువరాలు శ్రీవాణితో కలిసి ఉంటున్నారు. శివప్రభాకర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి సానుభూతి వ్యక్తం చేస్తూ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఆర్థిక సాయం అందజేత

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన ఈడిగ కృష్ణుడు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి భార్య అరుణమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను సర్పంచ్ సరోజమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగార్జున సోమవారం అందజేశారు. మిగతా రూ.90 వేలు త్వరలోనే మృతుని భార్య ఖాతాలో జమ అవుతాయని సర్పంచ్ తెలిపారు.

- **బేతంచెర్ల:** స్థానిక శేషారెడ్డి నగర్‌కు చెందిన ఉస్మాన్‌బాషా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక మృతిచెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి రూ.10 వేల నగదును మృతుని భార్య ఫాతిమాబీకి అందజేశారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణానికి చెందిన ఓ మహిళను అదనపు కట్నం కోసం భర్త, మామ, మరిది వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపిన వివరాలు.. బేతంచెర్ల పట్టణానికి చెందిన రామచంద్రుడు, మహేశ్వరి దంపతుల కుమార్తె గొల్ల లక్ష్మిదేవిని 12 ఏళ్ల క్రితం కృష్ణగిరి మండలం తొగర్చేడు గ్రామానికి చెందిన నాగరాజుకు ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలం నుంచి అదనపు కట్నం తేవాలని భర్త నాగరాజు, మామ నారాయణ, మరిది నాగేంద్ర వేధిస్తుండటంతో బాధితురాలు లక్ష్మిదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

జగనన్న పాలనతోనే బంగారు భవిష్యత్



ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి

కోవెలకుంట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనతోనే బంగారు భవిష్యత్ సాధ్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి అన్నారు. ‘జగనన్నే మా భవిష్యత్’ కార్యక్రమంపై సోమవారం కోవెలకుంట్లలో ర్యాలీ నిర్వహించారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు దశరథరామిరెడ్డి, గడ్డం వరప్రసాదరెడ్డి, శ్రీనివాసనాయక్, శివ, సుబ్బయ్యతో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు. పంచాయతీ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు నెలకొన్నాయన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇచ్చి వైఎస్ జగన్ మంచి ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి టీడీపీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బనగానపల్లె రూరల్: వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జీఎం టాకీస్ సర్కిల్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివబాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌పై పార్లమెంట్‌లో ఓ మాట, బయట మరో మాట మాట్లాడటం సిగ్గు చేటన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఐదుకోట్ల మంది ప్రజల ఆశాజ్యోతి అని, అలాంటి స్టీల్ ప్లాంట్‌ను కార్పొరేట్లకు అప్పజెప్పే ప్రయత్నం విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు కుల్లాయి స్వామి, సీపీఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భూధాల శ్రీనివాసులు, నాయకులు నాగాంజనేయులు, ఖాదర్ బాషా, ఉప్పలపాటి రంగయ్య, వెంకట్, శివయ్య, రాముడు పాల్గొన్నారు.

అరటి తోటకు నిప్పు



కాలిపోయిన అరటి తోటను చూపుతున్న రైతు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ పరిధిలో అరటి తోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన రైతు కృష్ణమోహన్ 2 ఎకరాల్లో అరటి సాగు చేశాడు. ప్రస్తుతం పంట పక్వదశలో ఉంది. సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు అరటి తోటకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అరటితోటతో పాటు డ్రిప్‌పైపులు, తెల్లపైపులు పూర్తిగా కాలిపోయి రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పేలిన సిలిండర్



ప్రమాదంలో కాలి పోయిన ఫ్రిజ్

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో వంట గ్యాస్ సిలిండర్ పేలి ఇంట్లోని వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలు.. కొండపేటలో నివసించే తులసీ సోమవారం సాయంత్రం ఇంటిలోని పూజ గదిలో పూజ చేస్తుండగా వంట గదిలోని గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వ్యాపించి పేలిపోయింది. సిలిండర్‌లో గ్యాస్ అయిపోవడంతో వేరే సిలిండర్ కాసేపు క్రితమే తెచ్చి అమర్చినట్లు బాధితురాలు తెలిసింది. ప్రమాదంలో వంటింటిలో ఫ్రిజ్‌తో పాటు ఎలక్ట్రికల్ సామగ్రి, ఇతర గృహోపకరణాలు, దుస్తులు కాలిపోయాయి. వీటి విలువ దాదాపు రూ.లక్ష ఉంటుందని బాధితురాలు తెలిపారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

డోన్: వయోవృద్ధులు ఆరోగ్య సంరక్షణ పట్ల జాగ్రత్త తీసుకోవాలని కామినేని ఆసుపత్రి ఎండీ చంద్రశేఖర్, వైద్యుడు అన్సర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జమ్‌కేర్ కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 200 మంది వయోవృద్ధులు, ఇతరులకు బీపీ, షుగర్, ఈసీజీ, ఆర్‌బీఎస్ పరీక్షలను ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భాను సింగ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఐదుగురు మట్కా బీటర్ల అరెస్టు

డోన్ టౌన్: పట్టణంలోని శేగు లాడ్జి వెనుక ఖాళీ ప్రదేశంలో మట్కా ఆడుతుండగా దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ శేషయ్య సోమవారం తెలిపారు. చిగురమానుపేట నబీరసూల్, షాషావలి, దూదేకుల ఖాజా హుస్సేన్, కొండపేట సంధు హరి, హరిప్రసాద్‌రెడ్డిలను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రూ.24,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.